

# రహస్యం

దండమూడి మహీధర్

రామారావు చాలాకాలం తరువాత కన్పించి కుశల ప్రశ్నలనంతరం దగ్గర్లోవున్న హోటల్‌కు లాక్కెళ్ళాడు.

"చెప్పవయ్యా చెప్పు. ఇప్పుడుచెప్పు ఏం చేస్తున్నావు?" అని ప్రశ్నించాడు రామారావు

బతకలేక బడిపంతులన్నారుగా మీలాంటి వాళ్ళంతా! అదే చేస్తున్నాను " అని సమాధానం చెప్పాను.

"ఇంకా జూనియర్ లెక్చరర్ పోస్టు ఇవ్వలేదా?"

"ఏరేలే అసలు ఇప్పుడున్న ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందోనని గత ఏడేళ్లుగా గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకొని కాలం గడుపుతున్నాను."

'అంత అపాయంలో వుండే మా హైద్రాబాద్ వచ్చెయ్! ఏదోఒకటి చూసిపెడతా."

"ఏదోఒకటి ఏంచూసి పెడతావు?"

నేను రానుబాబూ మీ హైదరాబాదు! నన్నిక్కడే వుండనివ్వు!' అని అంటూ కాఫీ ముగించాను.

రామారావు అప్పటికి సగం కాఫీ తాగాడు

'అవునుగాని-ఈ మధ్య ఏదో పుస్తకాల క్యాటలాగులో నీపేరు చూశాను. ఏవో పుస్తకాలు రాసినట్టున్నావు?' అని ప్రశ్నించాడు రామారావు అదోలా మొహం బెట్టి!

ఏదో రాశాను. కాలక్షేపంకోసం! తెలిసిన పబ్లిషరు కావాలంటేనూ! అంతేగాని లోకాన్ని ఉద్ధరించాలనే వుద్దేశ్యంతో మాత్రం నేనా పుస్తకాలు రాయలేదు ' అని కాఫీగ్లాసు పక్కనెట్టాను.

రామారావు అప్పటికి కాఫీ ముగించాడు.

"సరేగాని-నువ్వు రాసిన పుస్తకాలు రెండేసి కాపీలు చొప్పున నాకివ్వాలి అని అన్నాడు రామారావు.

"ఒక్క కాపీకూడా ఇచ్చుకోలేను " అన్నాను నేను ఖచ్చితంగా.

"ఎందుకని?"

"ఈ పూర్వే ఆరేసి కాపీలిస్తాను రచయితకు ఆ తరువాత చచ్చిగీపెట్టినా కాపీ ఇవ్వరు. అంతగా కావాలంటే సెకండ్‌హ్యాండ్ బుక్‌షాపుల్లో కొనుక్కోవాలి " అని అన్నాను నేను.

"సరే-అయితే ఆ పబ్లిషర్ల పేర్లయినా ఇలా యివ్వు! నేను వసూలు చేసుకుంటాను." అని రామారావు కాఫీబిల్లు తీసుకొని లేచి నిలబడ్డాడు.

"కూర్చోవయా కూర్చో! ఆ పబ్లిషర్ల పేర్లు ఇస్తానుగాని - ఇంతకూ చెప్పావు కాదు - రెండేసి కాపీలు ఇవ్వమంటున్నావు ఏ పత్రికలోనైనా రివ్యూ చేయిస్తావేమిటి?" అని వుండబట్టలేక అడిగాను.

'చేయించడమేమిటి. చేస్తాను' అన్నాడు రామారావు లేచినవాడు మళ్ళీ కూర్చుంటూ!

'చెప్పావుకాదు, అయితే ప్రస్తుతం పత్రిక నడుపుతున్నావన్నమాట! ఏమిటా పత్రికపేరు!' అని అడిగాను.

రామారావు చెప్పిన పత్రికపేరు వినేప్పటికి నాకాశ్చర్యం వేసింది.

'ఏమిటి నువ్వనేది. నాకర్థం కావడంలేదు!' అని ప్రశ్నించాను.

"ఆ పత్రికను ఎడిట్ చేసేది ఫలానా కావచ్చు! కాని హైదరాబాదులో వుంటూనే రివ్యూలన్నీ నేనే రాస్తూ వుంటాను" అని ధీమాగా అనేశాడు.

ఈసారి నేను మరింత ఆశ్చర్యపోయాను. రామారావు చెప్పిన పత్రికను నేను దాని ప్రారంభ సంచికనుంచీ చూస్తున్నాను. పైగా ఆ పత్రిక ఎడిటర్ అంటే నాకు ప్రత్యేకమైన అభిమానంకూడా వున్నది. వారం వారం నేను చదివే పత్రిక అదొక్కటే! ఆ పత్రికలో నేనెప్పుడూ రామారావు పేరు చూడలేదు. బ్లఫ్ చేస్తున్నాడేమో ననిపించింది.

నేను ఆలోచిస్తున్నట్టు పసిగట్టిన రామారావు వెంటనే—నా భుజంమీద చెయ్యివేసి — "నేనా పత్రికలో నానావిధాల పేరుతో ప్రత్యక్షమవుతూ వుంటాను! ఆశ్చర్యపడకు మిత్రమా?" అని తన కున్న అరడజను మారుపేర్లూ ఏకరువు బెట్టాడు.

నాకు వెంటనే క్రితంవారంలో వెలువడినరివ్యూ ఒకటి గుర్తుకొచ్చింది. ఆ రివ్యూలో రచయితను మొదటినుంచి చివరదాకా పొగడడమే సరిపోయింది. ఆంధ్రదేశంలో అంతకు మించిన రచయిత ఇంతవరకూ పుట్టలేదు. పుట్టబోడుకూడాను అని అనడం జరిగింది ఆ పుస్తకం వెల ఐదు రూపాయలు పెట్టటం జరిగినా - ఇంగ్లీషు పుస్తకాలతో పోల్చిచూస్తే దీని వెల చాలా తక్కువన్నారు. ఇకపోతే ఆ పుస్తకంలో ఒక డజను వ్యాపార ప్రకటన లున్నాయి. ఇటువంటి ప్రకటన లుండడంవల్ల ఈ పుస్తకం విలువ మరింత పెరిగిందన్నారు. విరివిగా ప్రచారం కావడానికి అవకాశం ఏర్పడుతుందని - ఇందుకు రచయితను ఆ సమీక్షకుడు ఎంతగానో ప్రశంసించాడు.

"అయితే క్రిందటివారం ఫలానా పుస్తకాన్ని అలా ఆకాశానికి లేవనెత్తావు? ఏమిటో విశేషం? ఆ పుస్తకాన్ని నేనూ చదివాను! పరమచెత్త! దాన్ని నువ్వు అంతగా ఎందుకు పొగిడావో నాకర్థం కావడంలేదు!" అని ఉండబట్టలేక అనేశాను.

నా మాటలు వింటూనే రామారావు లేచి నిలబడ్డాడు. బిల్లు చెల్లించాడు. ఇద్దరం హోటలు మెట్లు దిగుతున్నాం.

'అతగాడు నాకు చాలా సన్నిహితుడు. పైగా ఈ మధ్యనే నా కథల పుస్తకం కూడా ఒకటి

(మిగతా 48 వ పేజీలో)




ఆధునిక కథా సాహిత్యాన్ని అత్యంత సహజంగా రమణీయంగా తీర్చిదిద్ది కథానికకి ఒక స్వరూపాన్నిచ్చినవారు కొడవటిగంటి రాచకొండ., బీనాదేవిగార్లు. వారి కథలతో పరిచయం అయినకొద్దీ మనకి ఎంతో ప్రపంచాన్ని చూడగలిగామన్న సంతృప్తి. ఎందరో నూతన వ్యక్తులతో పరిచయమై వారి స్వరూప స్వభావాలను తెలుసుకున్నామన్న సంతోషం కలుగుతాయి. అన్ని రకాల స్వభావాలుగల వ్యక్తులు నిజానికి జీవితంలో తారసపడతారు కూడా. ఆ వ్యక్తులు వాస్తవిక ప్రపంచానికి ప్రతిబింబాలు. అందుకే వారి కథలు సార్వకాలిక సార్వజనీనా లయ్యాయి.

ఫస్ట్ కేస్ బీనాదేవిగారి కథల సంపుటి అంత మాత్రమేకాదు. ఆ కథలు చదివాక ఎన్నో కావ్యాలనే చదివామన్న తృప్తి కలుగుతుంది. ఫస్ట్ కేస్ మొదటికథ అదే సంపుటికి పెట్టినపేరు.

ఆనందరావు 'బంగారుపిచిక' యం.బి బి యస్ పూర్తిచేశాడు. ఏంచెయ్యాలి తరువాతన్నదిసమస్య.

లోకంలో బీదరికం వున్నదని అతనికి చూచాయిగా తెలుసు.

సెలవులకి రాజు అనే స్నేహితుడితో వాళ్ళ ఊరు వెళ్ళాడు. అక్కడే అతనికి ఫస్ట్ కేస్ తగిలింది. రాజువాళ్ళ తోటమాలి కూతురికి జబ్బుచేసింది రాజు వెళ్ళలేనన్నాడు. ఆనందరావు ఆ కేస్ 'హాండిల్' చేసాడు.

ఆ రోగిష్ఠిపిల్ల ఆకలితో చచ్చిపోబోతోంది. ఆ గుడిసెలో ఏమీలేవు. నీళ్ళుకూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. హార్లిక్సుకోసం ఇంటికి వాళ్ళపెద్దపిల్లని తీసుకుని వెళ్ళాడు. తనకి తాళం చెవులు దొరకడం ఆలస్యమైంది. ముందరగా హార్లిక్స్ ఆ పిల్లచేత పంపాడు. తిరిగి తను గుడిసె చేరేసరికి పిల్లపోయింది. తను చేపట్టిన మొదటికేస్ పోవటానికి కారణం దరిద్రం ... లోకంలో ఉన్న దారిద్ర్యాన్ని మొదటిసారిగా చూసాడు. ఆలోచిస్తూ వస్తున్నాడు. హార్లిక్స్ తీసికెళ్ళిన అమ్మాయి పాముకరచి చచ్చిపోయింది. ఆమె ప్రక్కనే ఫ్లాస్కమూత తీసి ఉంది —

ఆనందరావు ఉచితంగా పేదలకి సేవచేయాలనుకున్న భావన ఆర్నెల్ల తర్వాతఅమెరికా వెళ్ళటంతో నమసిపోయింది.

మరో కథ 'దబ్బు' ధనమదాంధతతో పేదవాళ్ళంచరూపురుగుల్లా భావించే ఒకడాక్టర్ తనకొడుకుని ఒక పేదవాడు నీటిలోనుండి రక్షించి కాపాడమన్నప్పుడు పేదోడిబిక్షగా భావించి అటుచూడనన్నాడు. కడప ఆ బిక్ష తనబిడ్డని తెలిసాక లాభం లేకపోయింది. కాని 'ఆ పేదోడి సత్తేనికి' అను పుత్రికో దిక్కులేని చావు చచ్చిపోతాడు.

ఇలా ఈసంపుటిలో ఉన్న కథలు పదునాలుగు. ఏ కథకి ఆ కథే ఒక కావ్యం కథా వస్తువు ట్రీట్‌మెంటు, అంతకంటె టైటిల్ ఒకదానికి ఒకటి తీసిపోకుండా కథకి కావ్యత్వం సంతరించిపెట్టాయి.

ప్రపంచంలోని అనేక జీవితాల వ్యాఖ్యానం మనం ఈ కథల్లో చూడవచ్చు. తొడిమలేని పువ్వు నీతిలేని ఒక పోలీస్ ఆఫీసరు కథ. జ్యోతిషం. ఆ పిచ్చి నమ్మకంపై కొట్టిన దెబ్బ — "తప్పు" కష్టపడి తను చదువు చెప్పిస్తే పేపరులోని అచ్చు తప్పుకి ఆత్మహత్య చేసుకున్న మనవడున్న రాజమ్మ కథ —

# ఫస్ట్ కేస్

## బీనాదేవి కథలు

రచన : బీనాదేవి

ప్రచురణ : నవభారత్ పబ్లికేషన్స్

సోల్ డిస్ట్రిబ్యూటర్స్, నవభారత్ బుక్‌హౌస్

ఏలూరు రోడ్, విజయవాడ - 2

వెల. ఐదు రూపాయలు

'చీకటి చీలింది' — ఒక రూరల్ హాస్పిటల్, ఒకే డాక్టరు. ఓ రాత్రి ఓ కారు బండిని గుద్దుకుని యాక్సిడెంట్ అయింది. పేదలంటే డాక్టర్‌కి దయ. అయితే ఆ సమయంలో ఒకడికే ఆపరేషన్ చేయగలడు. ఒకడికి చేసేసరికి రెండో ప్రాణి దక్కదు — అక్కడి డాక్టర్ సందిగ్ధ స్థితి. చివరకి ధనవంతుడికి ఆపరేషన్ చేశాడు. పేదవాడు చచ్చిపోయాడు. ఆ ధనవంతుడు జీవితంలో వంచితుడైచనిపోవాలని బయలుదేరాడు.

అతడు బ్రతికాడు. బ్రతకటం అవసరమైన — పేదవాడు మరణించాడు — ఈ కథకి సూచనప్రాయంగా ఐడియా ఇచ్చినవారు రాచకొండవారట.

'సిక్స్‌క్ సెక్స్'. ఒక స్మగులింగ్ వ్యాపారి ఒక ఆఫీసరుని ఎలా మోసం చేశాడన్నది. పారేసుకున్న బొమ్మ. ఒక సాంసారిక గాథ తీర్పు. పతనమైన కోర్టు మున్సిఫ్ తీరు. ఆత్మహత్య. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేభార్యతో వేగలేకపోతున్న ఒక భర్త కథ. నల్లంచు తెల్లచీర. బోయ్‌మీట్స్‌గర్ల్ స్టోరీ. కుక్క. జీవితంలో ఎంతో పై మెట్టుమీద ఉన్న ఒకతని దాగున్నకల్మషప్రవృత్తిఫలితం. మారాజు. ఏనుగు కాలిక్రింద మరణించిన అర్ధాయుష్కుడిగాథ.

అఖరిది(కన్నీళ్ళొచ్చాయి.) వచన గేయ కథ

బీనాదేవిగారి కథాకథనం ఇతరులకి అనుకరణసాధ్యం కాదని పీఠికలో కొడవటిగంటి అన్నారు. అది అక్షరాల నిజం. వారి శైలి అనితర సాధ్యం. కథకి చెప్పేతీరు ముందు పఠితని దాగాఆకర్షిస్తుంది. భాష చాలా భాగం పాత్రోచితం - 'మంది' కథలు. ఆ 'మంది' మాటల్లో చెప్పటం జరిగింది. వారి భాష ఏస, కాని భావం బరువైంది. సంస్కారంలోతైంది. అందుకే కథల్లో వాళ్ళు కేవలం వాళ్ళ బాహ్య స్వరూపాల్లో కాక అంతర స్వరూపాల్లో సాక్షాత్కరిస్తారు. టైటిల్స్ సాధారణంగా సింబాలిక్‌గా ఉంటాయి. కథని జీర్ణించుకున్న తర్వాతే ఎరిత టైటిల్‌కి ఉన్న విలువ తెలుసుకోగల్గుతారు.

"వీరి కథల్లో ఒరిజినాలిటీ ఉంది. అవి ప్రతిభా సమన్వితంగా ఉన్నాయి, నవరసభరితంగా ఉన్నాయి" అంటారు రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు వీరి కథల్ని గురించి.

కృత్రిమ వాతావరణానికి, పాత్ర చిత్రణకి అలవాటుపడిన పాఠకలోకానికి వాస్తవిక ప్రపంచ స్వరూప స్వభావాదులకు వ్యాఖ్యాన పూర్వకంగా విప్పిచెప్పగలవి అభ్యుదయం వెల్లివిరిసే బీనాదేవి గారి కథలు!

— టి. నరసింహమూర్తి

# రహస్యం

(41 వ పేజీ తరువాయి)

వేశాడు!" అని అసలు రహస్యం బయటబెట్టి — చేతిలో వున్న బ్యాగ్‌లోనుంచి కాపీఒకటితీసి నాచేతి కందించారు.

బస్ టైం అయిందని రామారావువెళ్ళిపోయాడు. నేను 'నవోదయ' వైపు వెళ్ళిపోయాను రామారావును గురించి ఆలోచించుకుంటూ!

* * * *

రెండువారాలు గడిచాయి వారపత్రిక తిరగేస్తున్నాను. చివరిపేజీల దగ్గరికొచ్చేప్పటికి హఠాత్తుగా నా దృష్టి నా పుస్తకాల రివ్యూమీదికి పోయింది. వరుసగా రెండు పుస్తకాల్ని సమీక్షించడం జరిగింది. మొదటినుంచి చివరిదాకా తిట్లే! మిత్రుడు దూషణలను భూషణలుగా భావించుకుంటూ ముందుకు సాగాను. చివరన రామారావు కొత్తగా రాసినకథల పుస్తకంమీద రివ్యూ కనిపించింది. రివ్యూ చివరని 'ఫణి' అనే రామారావు మారుపేరు చూసేప్పటికి నాకు నిజంగా నవ్వాగిందికాదు. ఈ రహస్యం అసలు ఎడిటర్‌కు తెలిస్తే బావుండు ననిపించింది.

★

Edited, Printed and Published by Maddukuri Chandrasekhara Rao, at Swatantra Art Printers, Vijayawada-4